



**మా ఇంట్లో మూడు బావులు వుండేవి. రెండు చిన్నవి. ఒకటి పెద్దది. పెద్దబావిలో నీళ్ళు తియ్యగా వుండేవి. మా వాడకట్టులో వున్న బావుల్లో తియ్యటి నీళ్ళున్న బావి మాదే. అందుకని మా వాడకట్టోల్లందరూ మంచినీళ్లకి మా ఇంటికి వచ్చేవాళ్ళు.**

వర్షాకాలం మా వూర్లో చెరువు నిండినప్పుడు, మా వాడ ఆ కొసనుంచి ఈ కొసదాకా పారినప్పుడు మా బావిలో నీళ్ళు పైదాకా వచ్చేవి. చేతికి అందేవి. పిల్లలందరమూ అక్కడికి పోయి బావిలోకి తొంగిచూసే వాళ్ళం. ఎక్కడినుంచి వచ్చేదో మా అమ్మ అందరినీ గదమాయించేది. అక్కడినుంచి దూరంగా పంపించేది. మాయచేసి మళ్ళీ బావి దగ్గరకు వచ్చేవాళ్ళం. అందులోకి తొంగి చూసేవాళ్ళం. నీళ్ళల్లో కదలాడే చేపలని చూసి పరవశించి పొయ్యేవాళ్ళం. ఊట చప్పుడుని గొప్ప సంగీతంలా వినేవాళ్ళం. మా మొఖాలని మా బావి నీళ్ళల్లో చూసుకునే వాళ్ళం. ఓ చిన్న రాయి వేసి మా ప్రతిబింబాలని చెదరగొట్టేవాళ్ళం. ప్రశాంతంగా ఉన్నప్పుడు మా బావి అద్దంలా కన్పించేది.

మా బావి నుంచి నీళ్ళు చేదుకోవడానికి ఓ గిలక వుండేది. అది సులువుగా తిరిగేందుకు దాని మధ్యలో వున్న కడ్డీకి గ్రీసు పూసేవాళ్ళు. ఆ గ్రీసు పూసినప్పుడు నీళ్ళు చేదడం సులువుగా వుండేది. గ్రీసు అయిపోయినప్పుడు ఆ గిలక వింత శబ్దాలని చేసేది. అప్పుడప్పుడు తాడు సందెన పడేది. అంటే గిలక మీద నుంచి తాడు కడ్డీమీద పడడం. దాన్ని సవరించడానికి చాలా కష్టపడేవాళ్ళు. పిల్లలు బావి మీదకి ఎక్కి సందెన తియ్యడం చాలా సులువు. కానీ మమ్మల్ని చెయ్యనిచ్చేవాళ్ళు కాదు. వాళ్ళే కష్టపడి సరి చేసుకునేవాళ్ళు.

అప్పుడప్పుడూ మాటల్లో పడి బావిలో బొక్కనని పడేసేవాళ్ళు. ఇక అప్పుడు చూడండి ఘోస. అందరి పనులూ ఆగిపొయ్యేవి. బొక్కనని బావి నుంచి తియ్యడం వాళ్ళకు సాధ్యమయ్యేది కాదు. మా మల్లయ్య రావాల్సిందే ఆ బొక్కనని తియ్యడానికి. అందుకోసం పాతాళ గరిగెని ఉపయోగించేవాడు.

## పాతాళ గరిగె

మా ఇంట్లో పాతాళ గరిగె వుండేది. అది చూడ్డానికి చాలా గమ్మత్తుగా వుండేది. అది వంకులు వంకులు తిరిగి ముళ్ళలాంటి కొసలు కలిగి వుండేది. అవి చాలా కొచ్చగా వుండేవి. దాని ఒంటినిండా కొక్కేల్లాంటి కొసలు. మనిషి తల వెంట్రుకలు వంకులు తిరిగి ముళ్ళలా మారినట్టుగా వుండేది. అది మా అరుగు మీద వుండేది. మా తాత చనిపోయిన తరువాత మా తాతర్రలోకి పోయింది.

*మా ఇంట్లో పాతాళ గరిగె వుండేది. అది చూడ్డానికి చాలా గమ్మత్తుగా వుండేది. అది వంకులు వంకులు తిరిగి ముళ్ళలాంటి కొసలు కలిగి వుండేది. అవి చాలా కొచ్చగా వుండేవి. దాని ఒంటినిండా కొక్కేల్లాంటి కొసలు. మనిషి తల వెంట్రుకలు వంకులు తిరిగి ముళ్ళలా మారినట్టుగా వుండేది.*

మా పాతాళ గరిగెది ఒక పెద్ద కథ. మా వాడకట్టులో వున్న ఏకైక పాతాళ గరిగె అది. ఎవరింట్లో బొక్కెన బావిలో పడ్డా అది బయటకు తియ్యడానికి మా పాతాళగరిగె అవసరం పడేది. కొంత మంది దాన్ని తీసుకునిపోయి తిరిగి ఇవ్వడంలో అశ్రద్ధ చేసేవాళ్ళు. అది ఎవరికి ఇచ్చారో ఒక్కోసారి మా అమ్మకి గుర్తుండేది కాదు. అందుకని ఓ పద్ధతిని కనిపెట్టింది మా అమ్మ. పాతాళ గరిగె కావల్సిన వాళ్ళు, వాళ్ళు రోజూ ఉపయోగించుకునే మంచినీళ్ళ చెంబు మా తాతర్రలో పెట్టి అక్కడ నుంచి పాతాళ గరిగె తీసుకుపోవాలి. మంచినీళ్ళ చెంబు వాళ్ళకి అవసరం వుంటుంది కాబట్టి పాతాళ గరిగె తిరిగి ఇవ్వటంలో అశ్రద్ధ చెయ్యరని ఈ పద్ధతిని ప్రవేశపెట్టింది మా అమ్మ. ఈ పద్ధతి అమల్లో పెట్టిన తరువాత పాతాళగరిగె త్వరగానే మా ఇంటికి వచ్చేసేది.

పాతాళ గరిగె తలకి ఓ పెద్దతాడు కట్టి బావిలోకి వేసేవాడు మా మల్లయ్య. బొక్కిన బావిలో తరచూ పడాలని మేం కోరుకునేవాళ్ళం. ఎందుకంటే అది బావిలో వేసి బొక్కెన కోసం వెతకడం చాలా గమ్మత్తుగా వుండేది. అందుకని ఎవరూ లేనప్పుడు మేమే బొక్కెనని బావిలో పడేసేవాళ్ళం. పాతాళ గరిగెను బావిలో వేసి గట్టిగా తిప్పేవాడు మల్లయ్య. బొక్కెన అంత సులువుగా దొరికేది కాదు. కానీ ఏవో వస్తువులు వచ్చేవి. ఒక్కోసారి మేం ఆడుకున్న రింగు దొరికేది. బంతి దొరికేది. ఆట

వస్తువులు దొరికేవి. వాటి రూపురేఖలు మారిపోయి వుండేవి. చివరికి కొంత కష్టపడిన తరువాత బొక్కెన దొరికేది. తాడుతో పడినప్పుడు కొంత సులువుగానే దొరికేది. కాని బొక్కెన దగ్గర వున్న ముడి వూసిపోయి పడినప్పుడు దొరకడం అంత సులువుగా ఉండేది కాదు. ఇప్పుడూ అంతే. ఏదో కాగితం కోసం వెతుకుతూ కూర్చుంటామా ఎన్నో కాగితాలు దొరుకుతాయి. ఫోటోలు దొరుకుతాయి. ఉత్తరాలు దొరుకుతాయి. మనసు ఎక్కడికో పోతుంది. వెదకబోయిన కాగితం ఎక్కడో మరుగున పడి, ఇల్లంతా కాగితాలమయం అవుతుంది. ఆలోచనల మయం అవుతుంది.

కానీ మా మల్లయ్య మాలా కాదు. తాళ్ళూ, బక్కెట్లు, కాగితాలు, బంతులు, రింగులూ వచ్చినా బొక్కెన తీసేవరకు వదిలిపెట్టేవాడు కాదు. బొక్కెన అంత త్వరగా దొరకద్దని మేం కోరుకునే వాళ్ళం. కానీ ఫలితం అంత వుండేది కాదు. మా మల్లయ్య మహా మాంత్రికుడు. బొక్కెనని తీసేవాడు. మేం నిరుత్సాహపడే వాళ్ళం.

కాలక్రమంలో మా రెండు బావులు బోర్ల పడ్డాయి. మా వూరిలోకి నల్లాలొచ్చాయి. మంచినీళ్ళకోసం మా వాడకట్టు వాళ్ళు రావడం లేదు. మా ఇంట్లోనే కాదు – అందరి ఇండ్లల్లో బావుల అవసరాలు లేకుండా పోతున్నాయి. చాలామంది బావులని పూడ్చిచేశారు. చాలా మంది ఇండ్లల్లోకి బోర్లు వచ్చేశాయి. వంద రెండు వందల ఫీట్ల నుంచి ఐదారువందల ఫీట్ల లోతుల దాకా బోర్లు వేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా వానలు లేక నల్లాల్లో మంచినీళ్ళు రావడం తగ్గిపోయింద. బోర్లలో కూడా నీళ్ళు లేకుండా పోయినాయి. కొంత మంది ఏడువందల నుంచి ఎనిమిది వందల ఫీట్ల లోతుల దాకా వెళ్తున్నారు. నీళ్ళు ట్యాంకుల మీద తెచ్చి అమ్ముతున్నారు. బకెటు నీళ్ళకి ధర వచ్చేసింది. డబ్బున్న వాళ్ళకి వోవర్ హెడ్ ట్యాంకుల మీదకు తమతోపాటు తెచ్చుకున్న కరెంటు మోటార్లతో నీళ్ళు పైకి ఎక్కిస్తున్నారు.

మా పెద్దబావి అలాగే వుంది. ఒక్క నీటిచుక్క లేకుండా దుఃఖిస్తూనే వుంది. బావి మీద గిలక వుంది. తాడు వుంది. బొక్కెన వుంది. కానీ నీళ్ళు లేవు. దాన్ని చూస్తే మా కళ్ళల్లో నీళ్ళు. ఎంతమందికి నీళ్ళని ఇచ్చింది ఆ బావి. నీళ్ళు చేదుకుంటూ పాడిన ఎన్ని పాటలని విన్నది ఆ బావి. ఎన్ని కథలని విన్నది. కష్టాలని కన్నది. ఇది మా బావి సంగతి. అన్ని బావుల సంగతి. బావుల సంగతే ఇలా వుంటే మా పాతాళ గరిగె సంగతి ఎలా వుంటుంది? అది మా తాతర్రలో నిద్రిస్తూనే వుంది. కాలం కఠినత్వానికి బలైపోయింది. ఇప్పుడు బొక్కెనలని తియ్యడానికి పాతాళ గరిగె అవసరం లేదు. కానీ మన మనస్సుల్లోని జ్ఞాపకాలని, మంచినీళ్ళ లాంటి స్వచ్ఛమైన మంచితనాన్ని బయటకు తీయడానికి మాత్రం ఓ పాతాళ గరిగె అవసరం వుంది. బహుశా కాలం ఆ పాతాళ గరిగెని సృష్టిస్తుందనుకుంటాను.

★

